క్లుప్తంగా

శ్రీవారి అష్టబంధన సంప్రోక్షణ



చిట్టేల(వత్సవాయి): శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం నుంచి శ్రీవారి అష్టబంధన సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వేద పండితులు దీవీ బాలాజీ రంగాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు హరి శివరామప్రసాద్ శాస్త్రి, సిరికొండ వెంకటసాయికృష్ణమాచార్యులు సుప్రభాత సేవ, మామిడి తోరణం, తోమాల సేవ, ఆచార్యస్తుతి, పుణ్యాహావాచనం, అగ్నిప్రణయనం, ప్రధాన కుంభారాధన కార్యక్రమాలను ఆలయ నిర్మాణ ధర్మకర్త మారెళ్ల పుల్లారెడ్డి దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం రాత్రి శ్రీ పీఠం వ్యవస్థాపకులు శ్రీ పరిపూర్ణానందస్వామి వారు భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు.

నందిగామలో పారిశుద్ధ్యం స్పెషల్ డ్రైవ్



నందిగామ: పట్టణ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణ పరిధిలోని రెండవ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సహకారం తోనే పారిశుద్ధ్యం మెరుగుపరుచుకోవచ్చని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురునాథం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఊయల సేవ



నందిగామ: మండలంలోని లింగాలపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం అమ్మవారికి పలు రకాల విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో ఊయల సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నష్టం వివరాలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తా



నందిగామ: పంట నష్టం వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని రాష్ట్ర ఆగ్రో డెవలప్‌మెంట్ చైర్మన్ మంగునూరు కొండారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దవరం పరిసర ప్రాంతాలలో అకాల వర్షాల కారణంగా కల్లాలలో దెబ్బతిన్న మిర్చి ,పసుపు కొమ్ములను శనివారం ఉద్యానవన శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆదేశాల నేపథ్యంలో అకాల వర్షం కారణంగా దెబ్బతిన్న మిర్చి, పసుపులను పరిశీలిస్తున్నామన్నారు. నష్టం వివరాలను ప్రభుత్వానికి తెలియపరచి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బాలాజీ కుమార్, స్థానిక అధికారి నీలిమ తదితరులు పాల్గొన్నారు.

స్కేటర్ తనూషకు అభినందన

పటమట(విజయవాడతూర్పు): మొహాలిలో ఈ నెల 2న ముగిసిన జాతీయ(అంతర్‌రాష్ట్ర) రోలర్ స్పీడ్ స్కేటింగ్ ఈవెంట్‌లో యల్లపు తనూష పతకాల్లో సత్తా చాటింది. ఈ సందర్భంగా శనివారం వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో కలిసిన కోచ్ చంటి, తనూష రింక్-3, రింక్-2 పోటీల్లో అండర్ 5-7 ఏజ్ గ్రూప్‌లో స్వర్ణం, కాంస్యం సాధించామన్నారు. ఈ సందర్భంగా వారిని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అభినందించారు. తనూష భవిష్యత్‌లో మరిన్ని పతకాలను సాధించాలని, విజయవాడ నగరానికి మరింత ఖ్యాతి తీసుకురావాలన్నారు.

అభివృద్ధి పథంలో గండేపల్లి

- నవరత్న పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు చేకూరిన మేలు
- రైతులు, మహిళల అభ్యున్నతికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు
- అన్ని కాలనీలలో అంతర్గత గ్రావెల్ రోడ్లన్నీ సీసీ రోడ్లుగా మార్పు



గండేపల్లి గ్రామం

కంచికచర్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల రూపురేఖలన్నీ మారిపోయాయి. గత ప్రభుత్వంలో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది. నవరత్న పథకాలతో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందారు. గ్రామంలోని అన్ని వీధులలో అంతర్గత గ్రావెల్ రోడ్లన్నీ సిమెంట్ కాంక్రీట్ రోడ్లుగా మార్చటంతో పాటు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు. వేసవికాలంలో సైతం రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు నిత్యం సరఫరా చేయటంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తొలగాయి. ఇంటింటికీ కుళాయి పథకం ద్వారా అన్ని ఇళ్లకు నిత్యం తాగునీరు సరఫరా అవుతోంది.

- వైఎస్సార్ రైతు భరోసా ద్వారా నాలుగేళ్లలో 382 మంది రైతులకు రూ.4,39 కోట్లు, అమ్మ ఒడి పథకం ద్వారా నాలుగేళ్లలో 1,478 మంది విద్యార్థులకు రూ.2.5 కోట్లు, జగనన్న చేదోడు పథకం ద్వారా 96 మందికి రూ.9.60 లక్షలు, జగనన్న తోడు పథకం ద్వారా 34 మందికి రూ.3.4 లక్షలు, జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా 222 మంది విద్యార్థులకు రూ.22.20 లక్షలు మంజూరయ్యాయి.
- గ్రామంలో రెండు లే అవుట్లలో ప్రభుత్వం రూ.1.40 కోట్లతో ఏడు ఎకరాల భూమిని కొనుగోలు చేసి 224 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలం ఉచితంగా కేటాయించింది. 231 మందికి ఇళ్లు మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణం కోసం రూ.1.83 కోట్ల రుణం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేసింది. వాతావరణంలో మార్పుల కారణంగా తుపాను లేదా పంట దెబ్బతిన్న పొలాలకు ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.53 లక్షలు నష్ట పరిహారం రైతులకు అందజేసింది.
- భవన నిర్మాణం కోసం ఎంపీపీ స్కూల్‌కు రూ.15లక్షలు, జిల్లా పరిషత్ స్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.25లక్షలు మంజూరు చేసింది.
- గ్రామ సచివాలయ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.40లక్షలు, ఇంటింటికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం కోసం రూ.22లక్షలు, రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా భవన నిర్మాణం కోసం రూ.24లక్షలు మంజూరయ్యాయి.
- అక్కా చెల్లెమ్మలు ఎవరిపై ఆధారపడకుండా స్వతహాగా ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం జగన్ ఆశయం. ఆ ఆశయంతో గతంలో ఉన్న రుణాలన్నీ మాఫీ చేశారు. బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చి మహిళలు ఉన్నతంగా ఎదిగేలా చేశారు. మహిళలు పారిశ్రామికంగా ఎదగాలని మహిళా చేయూత మార్ట్‌లు ఏర్పాటు చేసేలా వారికి అవగాహన కల్పించారు. రుణమాఫీ కింద 81 స్వయం సహాయక సంఘాలకు మూడు విడతలుగా రూ.1.94 కోట్లు మంజూరయ్యాయి.
- జనాభా ప్రాతిపదికన అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగునీరు పారుదల కోసం డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సీసీ రోడ్ల కోసం రూ.44 లక్షలు, డ్రైనేజీలకు రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి పనులన్నీ పూర్తయ్యాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి



గత ప్రభుత్వంలో గ్రామంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు. సమస్యలన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, సీఎం జగన్ నిధులు మంజూరు చేయటం వల్లే గ్రామం ఎంతో అభివృద్ధి జరిగింది. సీఎం జగన్‌కు గ్రామం రుణపడి ఉంటుంది.

– బొక్కా రవికుమార్, సర్పంచి, గండేపల్లి

పదిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

- వత్సవాయి మండలంలో 85.18 శాతం
- నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన గోపినేనిపాలెం జెడ్పీ హైస్కూలు
- పెనుగంచిప్రోలు మండలంలో 73 శాతం ఉత్తీర్ణత

వత్సవాయి: పదో తరగతి పరీక్షలలో మండలంలో 85.18 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖాధికారి ఎల్.నాగరాజు శనివారం తెలిపారు. మండలంలో మొత్తం 533 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 454 మంది ఉత్తీర్ణత చెందారు. వత్సవాయి జెడ్పీ పాఠశాలకు చెందిన ఎం.శారద అత్యుత్తమ మార్కులు సాధించింది. వత్సవాయి జెడ్పీ పాఠశాలలో 108 మంది పరీక్షలు రాయగా వారిలో 97 మంది ఉత్తీర్ణత చెందారు. వత్సవాయిలోని మహాత్మాజ్యోతిరావ్ పూలే పాఠశాలలో 27 మంది రాయగా 24 మందితో 88.89 శాతం, పోలంపల్లి జెడ్పీలో 32 మందికి 27 మందితో 84.38, కంభంపాడులో 81 మందికి 63 మందితో 77.78, కన్నెవీడులో 20 మందికి 19 మందితో 95 శాతం, మక్కపేట జెడ్పీలో 23 మందికి 18 మందితో 78.26, మంగొల్లులో 27 మందికి 23 మందితో 85.19 శాతం, భీమవరంలో 52 మందికి 35 మందితో 67.31 శాతం, గోపినేనిపాలెం జెడ్పీలో 25 మందికి గాను 25 మందితో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: విద్యాశాఖ శనివారం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని 7 ప్రభుత్వ పాఠశాలల్లో 73 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రవీంద్ర తెలిపారు. మండలంలో ఈ ఏడాది మొత్తం 337 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 247 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలో పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి రేగండ్ల నాగత్రిశూల్ అత్యుత్తమ మార్కులు సాధించాడు. పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో మొత్తం 145 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 112 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎస్ఎస్‌పీఎం హైస్కూల్‌లో మొత్తం 20 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కాగా 11 మంది ఉత్తీర్ణత సాధించారు. కొల్లికుళ్ల జెడ్పీ హైస్కూల్‌లో 43 మందికి 31 మంది ఉత్తీర్ణత సాధించారు. అనిగండ్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో 25 మందికి 18 మంది ఉత్తీర్ణత సాధించారు. ముండ్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో 31 మందికి 28 మంది, శనగపాడు జెడ్పీ హైస్కూల్‌లో 29 మందికి 16 మంది ఉత్తీర్ణత సాధించారు. కొణకంచి జెడ్పీ హైస్కూల్‌లో 44 మందికి 31 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

పేట ప్రభుత్వ పాఠశాలల్లో 58 శాతం ఉత్తీర్ణత

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో జగ్గయ్యపేట మండలంలో ఉన్న 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 58 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో డి.రవీంద్ర తెలిపారు. మండలంలో మొత్తం 772 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, వారిలో 451 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. బాలికల గురుకుల పాఠశాలలో 79 మందికి గాను 73 మంది ఉత్తీర్ణులై 92.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎస్టీ గురుకుల పాఠశాలలో మొత్తం 18 మందికి గాను 14 మంది ఉత్తీర్ణత సాధించగా, 13 మంది ప్రథమ స్థానంలో, ఒకరు ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 95 శాతం ఉత్తీర్ణతతో అనుమంచిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ మొదటి స్థానంలో ఉండగా, 32 శాతం ఉత్తీర్ణతతో జగ్గయ్యపేట టౌన్‌లోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ చివరి స్థానంలో నిలిచింది.

నందిగామ డివిజన్‌లో 67.85 శాతం ఉత్తీర్ణత

నందిగామ: నందిగామ డీవైఈవో కార్యాలయ పరిధిలో 7620 విద్యార్థులు ఈ ఏడాది పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించారని డీవైఈవో ఎం.వెంకటప్పయ్య శనివారం తెలిపారు. డివిజన్ పరిధిలోని 13 మండలాలలో ఏడాది మొత్తం 11,138 విద్యార్థులు పదవ తరగతి పరీక్ష రాయగా వారిలో 7620 మంది విద్యార్థులు కృతార్థులయ్యారన్నారు. డివిజన్ మొత్తంలో 67.85 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. నందిగామ మండలంలో 1,447 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 1,101 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. చందర్లపాడు మండలంలో 646 మంది పరీక్షలు రాయగా వారిలో 299 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.

కంచికచర్లలో 50 శాతం ఉత్తీర్ణత

కంచికచర్ల: విద్యాశాఖ శనివారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో మండలంలోని ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 475 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 237 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ ఎల్.చిట్టిబాబు శనివారం తెలిపారు. మండల కేంద్రమైన కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 138 మంది పరీక్ష రాయగా 76మంది ఉత్తీర్ణులయ్యారని, పరిటాల జెడ్పీ స్కూల్‌లో 90 మందికి 54 మంది, పెండ్యాలలో 85 మందికి 39 మంది, గండేపల్లిలో 56 మందికి 29 మంది, మోగులూరులో 52 మందికి 24 మంది, గనిఆత్కూరులో 27 మందికి 10 మంది, గొట్టుముక్కలలో 27 మందికి కేవలం అయిదుగురు కృతార్థులయ్యారని ఎంఈఓ వివరించారు.

గండేపల్లిలో పారిశుద్ధ్య పనులు

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి గ్రామంలో శనివారం శానిటేషన్ పనులు చేపట్టామని సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. మురుగునీరు పారుదల కోసం డ్రైనేజీల్లో చెత్తా చెదారాన్ని తొలగించటంతో పాటు బ్లీచింగ్, సున్నం చల్లించామన్నారు. వెలగని వీధిలైట్ల స్థానంలో కొత్తవాటిని అమర్చామని అన్నారు. వేసవికాలంలో అన్ని వార్డులకు తాగునీరు నిత్యం సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సహకారంతో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నామని సర్పంచి తెలిపారు.

వైభవంగా పేరంటాళ్లు అమ్మవారి తిరునాళ్ల

ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారి రథోత్సవం



లింగాలపాడులో అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలను వైభవంగా నిర్వహించటం అభినందనీయమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని లింగాలపాడు గ్రామంలో లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాలలో భాగంగా నిర్వహించిన రథోత్సవాన్ని ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే జగన్‌మోహనరావు అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖశాంతులతో మెలగాలని ఆకాంక్షించారు.

గ్రామంలో పండుగ వాతావరణం..

లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన కర్ణాటక డోలు వాయిద్యాలు, తెలంగాణ ఉబ్బుడోలు, కేరళ వాయిద్యాలు, అమలాపురం మహాగారడి, ద్రాక్షారామం వారి బాణసంచా వెలుగులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులు, గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తిరునాళ్ల ఉత్సవ కమిటీ చైర్మన్ పారుపల్లి హరిబాబు, ఆకుల హనుమంతరావు, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చందర్లపాడులో..

చందర్లపాడులో అలివేలమ్మ తిరునాళ్ల మహోత్సవాలలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, రాయల జానకిరామయ్య, కందుల నాగేశ్వరరావు, గుడివాడ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

నందిగామ: పట్టణంలోని ఏడవ నంబరు సచివాలయాన్ని శనివారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది మూవ్‌మెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల జాబితాలను పరిశీలించారు.అనంతరం సచివాలయానికి వచ్చే వారితో మాట్లాడారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు.

ఉబ్బసం వ్యాధిపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ హరీష్, పక్కన వైద్యులు సమరం, మారు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉబ్బసం వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని ఫిజీషియన్ డాక్టర్ కె.హరీష్ తెలిపారు. బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం ఉబ్బసం వ్యాధిపై ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ హరీష్ మాట్లాడుతూ.. ఉబ్బసం ఏ వయస్సు వారికైనా రావచ్చునని, దానికి ప్రధాన కారణం ఎలర్జీ అని చెప్పారు. దుమ్ముధూళి, పూల పుప్పొడి, పెంపుడు జంతువుల వెంట్రుకలు ఉబ్బసానికి కారణాలన్నారు. చల్లగాలి, కొన్ని ఆహార పదార్థాలు, మానసిక వత్తిడి, కొన్ని రకాల మందులు, ధూమపానం, రకరకాల ఇన్ఫెక్షన్లు, వ్యాయామం కూడా ఉబ్బసం తత్వం ఉన్న వాళ్లకి దానిని ప్రకోపించేటట్లు చేస్తాయన్నారు. ఉబ్బసం వచ్చిన వారిలో ప్రధానంగా ఆయాసం, పిల్లికూతలు ఉంటాయన్నారు. అలాగే ఛాతిలో నొప్పి, నిద్రపట్టక పోవడం, తలనొప్పి, అలసట, దగ్గు, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఉబ్బసాన్ని స్పైరోమీటర్ టెస్టు ద్వారా నిర్ధారణ చేసుకోవచ్చునని తెలిపారు. సదస్సుకు డాక్టర్ సమరం అధ్యక్షత వహించగా, డాక్టర్ మారు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

నందిగామ: నందిగామ పోలీసులు శనివారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేశారు. సీఐ సతీష్ తెలిపిన సమాచారం ప్రకారం నందిగామ శివారు రాఘవాపురం డొంక రోడ్డులో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి ఏడు సెల్ ఫోన్‌లు, రూ.9,270 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గడపగడపకు కార్యక్రమానికి విశేష స్పందన

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పెద్దాపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పెద్దాపురం(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి ఊహించని రీతిలో విశేష స్పందన వస్తోందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్తున్న తమకు ప్రజలు ఎదురేగి ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారన్నారు. ప్రతి ఒక్క ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన అన్నారు. తాము ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని, తమ దృష్టికి వచ్చిన ప్రతి ఒక్క సమస్యను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకే ఒక్కో సచివాలయానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో సైతం ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, నాయకులు బండి మురళి, చనుమోలు వాసు, కుంపటి శ్రీను, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి బాప్‌గార్డు మిషన్

ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



మున్సిపల్ కార్యాలయం వద్ద బాప్‌గార్డు మిషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: నందిగామ పట్టణంలో పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కీసర స్వర్ణ టోల్‌వేస్ అందజేసిన బాప్‌గార్డు మిషన్‌ను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టోల్‌వేస్ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు రూ.17.4 లక్షలతో కొనుగోలు చేసిన బాప్‌గార్డ్ మిషన్‌ను మున్సిపాలిటీకి అందించటం అభినందనీయమన్నారు. ఈ యంత్రంతో చెత్త ఎత్తటంతో పాటు మురుగు కాల్వల్లో పూడిక తీసేందుకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా సహకరించాలని సూచించారు. ముఖ్యంగా పట్టణ పరిధిలోని రహదారుల విస్తరణ, అభివృద్ధికి ఇన్వెంటా కెమికల్స్, క్రషర్స్ నిర్వాహకులు అందించిన సహకారం ఎనలేనిదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు మహ్మద్ మస్తాన్, నల్లమల్లి మురళి, కమిషనర్ డాక్టర్ జయరాం, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, పాములపాటి రమేష్, గుడివాడ సాంబశివరావు, ఖాలిక్, యాకుబ్ వలీ, మందా మరియమ్మ, విశ్వనాథపల్లి కృపారావు, జాఫర్ పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి వసంతోత్సవం



కృష్ణానదిలో చక్రతీర్థం నిర్వహిస్తున్న అర్చకులు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి తిరుక్కల్యాణ మహోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారికి చూర్ణోత్సవం, చక్రతీర్థం, వసంతోత్సవం కార్యక్రమాలను అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను వైభవంగా సమీపంలోని కృష్ణానదిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లి నదిలో వసంతోత్సవం, చక్రతీర్థం నిర్వహించారు. అర్చకులు వేదాంతం శ్రీధరాచార్యులు నదిలో ప్రత్యేక పూజల అనంతరం భక్తుల హర్షధ్వానాల నడుమ విగ్రహాలను ఆలయంలోకి తీసుకువచ్చారు. కల్యాణోత్సవాలలో భాగంగా రాత్రి కృష్ణానదిలో తెప్పోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా పడవను ఏర్పాటు చేసి గజ వాహనంపై ఉత్సవ మూర్తులు నదీ విహారం చేశారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో నాగరాజు, పెద్ద సంఖ్యలో భక్తులు, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం



వార్డుల పర్యటనలో సమస్యలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: ప్రాధాన్యతా క్రమంలో అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. వార్డుల పర్యటనలో భాగంగా శనివారం స్థానిక సత్యనారాయణపురం, మిట్టగూడెంలో ఆయన పర్యటించారు. మాంసం విక్రయశాలలను పరిశీలించి ఆ పరిసర ప్రాంతంలో త్వరలోనే డ్రైనేజీ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. సత్యనారాయణపురంలో మెయిన్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని, ప్రజలంతా రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు. మిట్టగూడెంలో నీటి సదుపాయం కోసం బోరు పంపు కావాలని స్థానికులు కోరగా, వారం రోజుల్లో బోరు ఏర్పాటుచేస్తామని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైఎస్సార్ సీపీ నాయకులు మోరె బాబి, దువ్వల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కడుపుబ్బ నవ్వించే సినిమా చాంగురే బంగారు రాజా

చిత్ర కథానాయకుడు కార్తీక్ రత్నం



మీడియాతో మాట్లాడుతున్న చాంగురే బంగారు రాజా హీరో కార్తీక్‌రత్నం, పక్కన హీరోయిన్ నిస్సీ, దర్శకుడు సతీష్ వర్మ

లబ్బీపేట(విజయవాడతూర్పు): చాంగురే బంగారు రాజా సినిమా ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తుందని ఆ చిత్రహీరో కార్తీక్‌రత్నం అన్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా శనివారం విజయవాడ నగరానికి విచ్చేసిన చిత్ర బృందం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ రత్నం మాట్లాడుతూ ప్రముఖ హీరో రవితేజ చాంగురే బంగారు రాజా చిత్రాన్ని నిర్మించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ కమెడియన్ హీరో సునీల్ తమ చిత్రానికి వాయిస్ ఓవర్ ఇచ్చారని, ఆయన వాయిస్‌తో వచ్చిన ట్రైలర్‌కి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ చిత్రంలోని సన్నివేశాలను దర్శకుడు చాలా చక్కగా తీశారని, ప్రేమికులను కచ్చితంగా ఆకట్టుకునే విధంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరోయిన్ నిస్సీ మాట్లాడుతూ నా తొలి చిత్రానికి హీరో రవితేజ నిర్మాతగా వ్యవహరించడం సంతోషంగా ఉందన్నారు. తనకు, హీరోకు మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తాయన్నారు. దర్శకుడు సతీష్‌వర్మ మాట్లాడుతూ ఈ వేసవిలోనే సినిమా రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. చిన్న చిత్రమైనా ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందన్నారు.